## అకాల వర్షం.. అన్నదాతకు కష్టం.. 2





## ముగిసిన రియాజ్ అంత్యక్రియలు.. 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 23న జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపికలు



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న అండర్-14, 16, 18 జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి భూలోకం విజయ్ కాంత్‌రావు తెలిపారు. ఎంపికలు జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో గల ఎస్ఎఫ్ఎస్ పాఠశాల మైదానంలో ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9848230207 నంబరును సంప్రదించాలన్నారు.





## నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

**అక్షరటుడే, మెండోరా:** ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి వరద తగ్గిపోయింది. దీంతో అధికారులు గేట్లు మూసివేశారు. జిల్లాలో వర్షాలు పూర్తిగా తగ్గిపోవడం, ఎగువ మహారాష్ట్రలో సైతం వర్షాలు తగ్గాయి. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం జలాశయంలోకి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే 573 క్యూసెక్కుల నీరు ఆవిరిగా పోతోంది.

### నిజాంసాగర్‌కు వరద తగ్గుముఖం

నిజాంసాగర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ఒక గేట్ ద్వారా 4,048 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది. కాగా.. ఎగువన సింగూరు నుంచి ప్రవాహం తగ్గింది. దీంతో అధికారులు దిగువకు నీటి విడుదలను తగ్గించారు.

## 22న ఎస్జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు

**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న అండర్ 19, 17, 14 బాల బాలికల ఆర్చరీ టోర్నమెంట్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి నాగమణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి జిల్లాలోని దోమకొండ కోటలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్-19 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ పదో తరగతి మెమో తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు కామారెడ్డి ఎస్జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్-14 బాలబాలికల సెపక్ తక్రా ఎంపికలు ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి నాగమణి తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలం పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాలలో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు కామారెడ్డి ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్‌ను సంప్రదించాలని కోరారు.

**దీపావళి సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పేకాట జోరుగా సాగింది. పోలీసులు హెచ్చరించినా.. పలువురు గుట్టుగా జూదం ఆడారు. సాధారణంగా దీపావళి సమయంలో చాలా మంది పేకాట ఆడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అయినా ప్రత్యేక స్థావరాల్లో పేకాట ఆడారు. లక్షల రూపాయలు బెట్టింగ్ వేసుకుని మరీ జూదం ఆడడంతో నిమగ్నమయ్యారు. పోలీసులు పలువురి ఆట కట్టించి కేసులు నమోదు చేశారు. అలాగే భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు.**

- అక్షరటుడే, కామారెడ్డి



# జోరుగా సాగిన పేకాట

▸ దాడులు జరిపిన పోలీసులు ▸ పలువురు అరెస్ట్.. భారీగా నగదు స్వాధీనం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పేకాటరాయుళ్లు పలు ప్రాంతాలను జూదానికి అడ్డాగా మార్చుకున్నారు. పోలీసుల కంట పడకుండా గుట్టుగా పేకాట ఆడేందుకు స్కెచ్ వేశారు. శివారు ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని అక్కడే తిష్ట వేసుకున్నారు. ఉదయం రాత్రి అని తేడా లేకుండా అదేపనిగా పేకాట ఆడుతున్నారు. ఫార్మ్ హౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాలు, పొలం గట్లు, ఇళ్లు, అపార్టుమెంట్లు ఇలా అనేక చోట్ల పేకాట ఆడుతున్నారు. కొంతమంది ప్రత్యేకంగా పేకాట కోసమే ఇళ్లను అద్దెకు తీసుకుని సకల సౌకర్యాలు అందులో ఏర్పర్చుకున్నారు. దీపావళి కావడంతో చాలా మంది పేకాట ఆడారు.

### ప్రత్యేక అడ్డాలు

పేకాట ఆడేందుకు పలువురు ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేస్తున్నారు. పేకాట రాయుళ్లకు పలు ఆఫర్లు ప్రకటిస్తూ అక్కడికి వచ్చేలా చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ఫార్మ్ హౌస్‌లలో ఏసీ లాంటి సౌకర్యాలు కల్పిస్తూ పేకాడే వారి వద్ద ఫీజు పేరుతో వసూళ్లు చేస్తున్నారు. వీరికి మద్యం, విందులు ఏర్పా టు చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఈ తరహా ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రతి రోజు లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లుగా తెలుస్తోంది.

### పోలీసుల దాడులు

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జూదం ఆడుతున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. పక్కా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పేకాట అడ్డాలపై దాడులు చేసి ప్రతి రోజూ పదుల సంఖ్యలో జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి భారీగా నగదు, మొబైల్స్, వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు.

### దీపావళి స్పెషల్ ఆటలు

దీపావళి సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పేకాట స్థావరాలు ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. కోట్ల రూపాయల బెట్టింగ్ నిర్వహించినట్లుగా సమాచారం. దీపావళి సందర్భంగా పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. పోలీసుల దాడుల్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. పలువురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం 82 కేసులు నమోదు చేసి 469 వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.10,40,089 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా చూడాలి

**అక్షరటుడే, బోధన్ :** ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బోధన్ మండలం పెగడాపల్లి, సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్‌లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.



ఆయన వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో సాయాగౌడ్, డీఏవో గోవింద్, తహశీల్దార్ విఠల్, ఏవో సంతోష్ ఉన్నారు.



## కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన డీజీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రౌడీ షీటర్ దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని డీజీపీ శివధర్ రెడ్డి పరామర్శించారు. నిజామాబాద్ నగరంలో న్యూ బ్యాంక్ కాలనీలో గల ప్రమోద్ ఇంటికి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రమోద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సౌకర్యాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంటి స్థలం, ఉద్యోగం వీలైనంత త్వరగా కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, సీపీ సాయిచైతన్య, అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది ఉన్నారు. కాగా.. అంతకుముందు నిజామాబాద్ జిల్లాకు వచ్చిన డీజీపీకి ఐజీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన కానిస్టేబుల్ ప్రమోద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## 18 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో 18 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి మహేష్ కుమార్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జిల్లాలోని బాన్సువాడ మండలం హన్మాజీపేట, బిచ్కుంద మండలం పుల్కల్, పిట్లం మండల కేంద్రం, భిక్కనూరు మండలం అంతంపల్లి, బస్వాపూర్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మాచారెడ్డి మండలంలోని సోమార్ పేట, రాజంపేట మండలం రాజంపేట, ఆర్గొండ, కొండాపూర్, గాంధారి మండలంలోని ముథోలి, గాంధారి, సదాశివనగర్ మండలంలోని భూంపల్లి, దగ్గి, తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్, తాడ్వాయి, దేమికలాన్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు మొక్కజొన్న పంటను 14శాతం తేమ ఉండేలా ఎండబెట్టాలని సూచించారు. క్వింటాలు మొక్కజొన్నకు ప్రభుత్వం రూ.2,400 మద్దతు ధర ఇస్తుందని చెప్పారు.

## పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి: డీఐజీ





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** శాంతి భద్రతలను పరిరక్షణ కోసం ఎంతో మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని డీఐజీ చంద్రశేఖర్ అన్నారు. వారి త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం డీఐజీ చంద్రశేఖర్‌తో పాటు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు ప్రాణత్యాగం చేశారన్నారు. వారిని స్మరించుకోవడానికి అక్టోబర్ 21న అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాలో కూడా ఎంతోమంది పోలీసు అధికారులు ప్రాణత్యాగం చేశారన్నారు. గతంలో నక్సలైట్ల సమస్య ఉన్నప్పుడు ఎంతోమంది పోలీసు అధికారులు, జవాన్లు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని వివరించారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి 24 గంటలు ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక భద్రత దళాలు ఏర్పడక ముందు సరిహద్దుల్లో రక్షించే బాధ్యతలను సీఆర్పీఎఫ్ జవాన్లు నిర్వహిస్తూ వచ్చారన్నారు. 1959 అక్టోబర్ 21న పంజాబ్‌కు చెందిన డీఎస్పీ కరణ్‌సింగ్ నేతృత్వంలో 21 మంది సభ్యులు కలిగిన బృందం చైనా రక్షణ దళాలతో ఎదురొడ్డి పోరాడిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది పోలీసు అధికారులు, జవాన్లు ప్రజలను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేశారన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మర్చిపోలేనివని ఆయన పేర్కొన్నారు.

## అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి..

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీ రాజేష్ చంద్ర నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, భద్రత, శాంతి స్థాపన కోసం అంకితభావంతో సేవలందించే వ్యవస్థ పోలీస్ శాఖ అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఏడుగురు పోలీసు సిబ్బంది అమరులయ్యారని వారికి గౌరవప్రదంగా నివాళులర్పిస్తున్నానని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి సంక్షేమానికి అన్ని విధాలా సహాయం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమాజంలో శాంతి భద్రతల స్థాపన కోసం అసాంఘిక శక్తులతో పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమైనవని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. వారు చూపిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ కర్తవ్య నిష్ఠతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఆర్మీ జవానులు, పోలీసులు విధి నిర్వాహణలో ఎల్లప్పుడూ దేశ రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులతో పోరాటంలో 191 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందారని ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ కమాండెంట్ బానోత్ జవహర్‌లాల్, కానిస్టేబుళ్లు సందీప్, వడ్ల శ్రీధర్, యం.పవన్ కళ్యాణ్, బి. సైదులు అమరులయ్యారని ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నెరవేర్చడం.. వారి కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేయడం.. ఆర్థికపరమైన ప్రయోజనాలు సమయానికి అందేలా చూడడం.. మానసిక బలాన్ని అందించడం ఇవే పోలీస్ అమరవీరులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల స్మరణార్థం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, ఫోటో, వీడియో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నరసింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐలు నరహరి, రామన్, సంతోష్ కుమార్, ఆర్ఐలు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఎస్సైలు, సిబ్బందితో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్




నివాళులర్పిస్తున్న ఎస్పీ




# అకాల వర్షం.. అన్నదాతకు కష్టం..

**ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం, మొక్కజొన్న చేతికి వచ్చిన సమయంలో వర్షా లు రైతులకు తీరని నష్టం మిగులుస్తున్నాయి. ఉమ్మడిజిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షా లతో పంటలు తడిసి రైతుల కష్టాలు మరింత పెరిగాయి. రోడ్లపై, కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న పంట పూర్తిగా తడిసిపోయింది. అలాగే కోతకు వచ్చిన ధాన్యం కూడా వర్షా నికి తడిసిపోయింది. బాన్సువాడ నియోజకవర్గంలో, పెద్దకొడప్‌గల్, ఆర్మూర్‌లో కురిసిన వర్షా లకు మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయింది.** – అక్షరటుడే, నెట్‌వర్క్






## పోలీస్ అమరవీరులకు వాకర్స్ అసోసియేషన్ ఘననివాళి

**అక్షరటుడే, ఇందూరు:** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ అమరవీరుల పార్క్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరులు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని వారు వ్యాఖ్యానించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయుష్ పురుషోత్తం, కిషన్, శంకర్, దయానంద్, శ్రీహరి, రాజేందర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మోతిబిందు ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని కాటేపల్లి తండాకు చెందిన గర్భిణి అత్యవసర స్థితిలో 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. కాటేపల్లి తండాకు చెందిన గర్భిణికి సోమవారం రాత్రి పురిటినొప్పులు ఎక్కువ కావడంతో '108'కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని మెడికల్ టెక్నీషియన్ పేర్కొన్నారు. అనంతరం తల్లీబిడ్డను బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు టెక్నీషియన్ బాలరాజు, పైలట్ సాయిలు పేర్కొన్నారు.



## శనగ విత్తనాల పంపిణీ

**అక్షరటుడే,కోటగిరి :** పోతంగల్ మండలంలోని హెగ్డోలి రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్‌లో భాగంగా యాసంగి కోసం సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ విత్తనాలు సబ్సిడీపై రైతుకు రూ.2,500 ధర కలిగిన 25 కేజీల బ్యాగ్‌తో పాటు జీవన ఎరువు రూ.1,800 లభిస్తుందని ఏవో నిశిత తెలిపారు. మండలానికి 644 ఎకరాలకు సరిపడా 161 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంతు, ఏఈవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, సురేష్, నాగరాజు, పవన్, సుభాష్, పరమేశ్, త్రిముక్, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి దారుణ హత్య

**అక్షరటుడే, బాన్సువాడ:** పండుగ పూట నస్రుల్లాబాద్ మండలంలో దారుణం జరిగింది. ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. నస్రుల్లాబాద్ ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకోల్ తండాలో దీపావళి పండుగ సందర్భంగా గుగులోత్ రాదిబాయి (65) పూజ చేస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన మెగావత్ సవాయిసింగ్ రాదిబాయి ఇంట్లోకి ప్రవేశించాడు. వెనుక నుంచి ఆమెపై గొడ్డలితో దాడి చేశాడు. అనంతరం చున్నీతో మెడకు ఉరివేసి ఆమెను హత్యచేశాడు. అనంతరం ఆమెపై ఉన్న ఆభరణాలను తీసుకున్నాడు. ఆ సమయంలో అడ్డుకోవడానికి యత్నించిన వారిపై కూడా దాడి చేసి ఆభరణాలతో పారిపోయాడు. సమాచారం అందుకున్న బాన్సువాడ సీఐ తిరుపతయ్య, ఎస్సై రాఘవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.


## రియాజ్ ఎన్‌కౌంటర్‌పై హెచ్‌ఆర్‌సీ కీలక ఆదేశాలు..

**అక్షరటుడే, హైదరాబాద్:** నిజామాబాద్ నగరంలో ఇటీవల చోటు చేసుకున్న రియాజ్ ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. మీడియా కథనాల ఆధారంగా ఎన్‌కౌంటర్ ఘటనను సుమోటోగా స్వీకరించింది. నవంబర్ 24లోగా ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రియాజ్‌ను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళ్లిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అతడు కానిస్టేబుల్ ప్రమోద్ పై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు రియాజ్ పారిపోగా.. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించి అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో రియాజ్ మరోసారి పోలీసులపై దాడి చేశాడు. ఈ సమయంలో రియాజ్ సైతం గాయపడ్డాడు. దీంతో అతడిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో సోమవారం రియాజ్ పోలీసులు తుపాకీ లాక్కొని కాల్పులు జరిపే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా జరిపిన కాల్పుల్లో రియాజ్ హతం అయ్యాడు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ సంఘటన కస్టడీ పరిస్థితులకు సంబంధించినది, ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని కమిషన్ అభిప్రాయ పడింది. సుమోటోగా విచారణకు తగిన కేసు అని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితులు, మెజిస్టీరియల్ విచారణ స్థితి, ఆదేశించిన ఏవైనా శాఖాపరమైన/న్యాయపరమైన చర్యలు, ఎన్‌కౌంటర్ మరణాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండడం, కాపీ, పోస్ట్‌మార్టం నివేదికతో సహా వాస్తవ నివేదికను సమర్పించాలని డీజీపీని ఆదేశించింది.

## ముగిసిన రియాజ్ అంత్యక్రియలు..



**అక్షరటుడే, ఇందూరు:** సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు రియాజ్ అంత్యక్రియలు ముగిశాయి. కానిస్టేబుల్ ప్రమోద్‌ను గత శుక్రవారం హత్య చేసి పారిపోయిన నిందితుడు రియాజ్ ఆదివారం పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. కాగా.. సోమవారం ఆసుపత్రిలో పోలీసుల రివాల్వర్ లాక్కొని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేయడంతో ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. రియాజ్ మృతదేహానికి మంగళవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో నిజామాబాద్ నగరంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.




**ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుభూతంలా మారింది. మూగజీవాలకు ముప్పుగా పరిణమిస్తోంది. ప్లాస్టిక్ కవర్లలో మిగిలిపోయిన ఆహారపదార్థాలను చుట్టి ఎక్కడపడితే అక్కడ పడేస్తుండడంతో మూగజీవాలు ఆహారాన్ని తినేప్రయత్నంలో ప్లాస్టిక్ కవర్లను సైతం తినేస్తున్నాయి. దీంతో అనారోగ్యాల పాలవుతున్నాయి. పెద్దకొడప్‌గల్‌లోని ఓ వైన్‌షాప్ పర్మిట్ రూం పక్కన వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి పడేయడంతో ఆవులు వాటిని తింటున్నాయి. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.**

– అక్షరటుడే, పెద్దకొడప్‌గల్



## కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించి మద్దతు ధర పొందాలి

**అక్షరటుడే, ముప్కాల్:** ప్రభుత్వ ధరలకే ధాన్యం, మొక్కజొన్న పంటలు కొంటామని రెంజల్ సొసైటీ ఛైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో న్యాయమైన ధరలు లభించేలా సొసైటీ చర్యలు చేపడుతుందని తెలిపారు. రైతుల శ్రమ ఫలించేలా ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు, సొసైటీ సెక్రెటరీ కె.గంగాధర్ స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**అక్షరటుడే, మెండోరా:** మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు మెండోరా మండలంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. వారు నిర్ణయించిందే ధర అన్నట్లుగా పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున మక్కల సేకరణకు అన్ని మండలాల్లో సహకార సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి మండలంలో నాలుగైదు కేంద్రాలు ఎంపిక చేసినప్పటికీ.. మెండోరా మండలంలో వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

## పేకాట స్థావరాలపై దాడి:పలువురి అరెస్ట్

**అక్షరటుడే, బాన్సువాడ:** పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ సీఐ తుల శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్ గ్రామంతో పాటు పట్టణంలోని సిద్ధిగల్లి ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 16 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,970 నగదు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎల్లారెడ్డి మండలంలో 51 మంది..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** దీపావళి పండుగ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల్లోని పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో లింగారెడ్డిపేట్, మల్కాపూర్, కళ్యాణి, వెలుట్లపేట, మౌలాన్ కేడ్, సాతెల్లి గ్రామాల్లో పేకాడుతున్న వారిని పట్టుకున్నారు. మొత్తం ఆరు కేసులు నమోదు చేసి 51 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.27,780 నగదు, 26 మొబైల్ ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సే శ్రీ మహేష్ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.